
సాక్షి
ఒడిశా

శనివారం । 28 । డిసెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.8,48,105లు, బంగారం 11గ్రాము 250 మిల్లీగ్రాములు వెండి 50 గ్రాముల 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



మాజీ ప్రధానికి నివాళి

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలు గుర్తు చేసుకున్నారు.

- 8లో



నేడు స్నాతకోత్సవం

ఐఐటీ స్నాతకోత్సవం నేడు జరగనుంది. ఏర్పాట్లు చేశారు.

- 8లో

మేఘాలాపన..







కొరాపుట్‌లో మేఘాలాపన వినిపిస్తోంది. శుక్రవారం దమంజోడి లోని భారత అల్యూమినియం కేంద్రం (నాల్కో) పరిశ్రమ ఆవరణలోని నాల్కో హిల్ టాప్ ప్రాంతంలో మేఘాలు దట్టంగా అల్లుకున్నాయి. వానకు తోడు చలిలో ఈ అద్భుత దృశ్యాలు ఆకట్టుకున్నాయి.

– కొరాపుట్

న్యూస్‌రీల్

పుష్పుణి ఉత్సవాల్లో డొంగర కవితా పఠనం



పరిషత్ కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

జయపురం: జయపురంలో జనవరి 13 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న పుష్పుణీ ఉత్సవాల్లో కవితా పఠన కార్యక్రమం నిర్వహించాలని జయపురం సాహిత్య పరిషత్ నిర్ణయించింది. గురువారం సాయంత్రం స్థానిక బ్యాంక్ కాలనీలోని లోకేశ్వరి చిత్తవినోదిని ఉద్యానవన ప్రాంగణంలో జయపురం సాహిత్య పరిషత్ కార్యవర్గ సమావేశం జరిగింది. పరిషత్ అధ్యక్షుడు హరిహర కరసుధా పట్నాయిక్ ఆహ్వానం మేరకు నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో కార్యదర్శి నిరంజన్ పాణిగ్రహి రానున్న రోజులలో పరిషత్ నిర్వహించనున్న కార్యక్రమాలను వివరించారు. ఆ ఏడాది ఆఖరి సమావేశం ఈ నెల 30న నిర్వహిస్తామన్నారు. జనవరి నెలలో రేలారే రేలారే కవితా కార్యక్రమం నిర్వహిస్తామని, ఆయా కార్యక్రమాలకు సభ్యులు అందరూ తమ స్వీయ కవితలను తీసుకు రావాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. ఈ సమావేశంలో కొంత మంది తమతమ రచనలను పరిషత్ అధ్యక్షునికి అందజేశారు.

60 మందికి నేత్ర పరీక్షలు



నేత్ర పరీక్షలు జరుపుతున్న డాక్టర్ విజయ కుమార్ ఆచార్య

జయపురం: కొరాపుట్ జిల్లా దుమురిపుట్ పంచాయతీ కెరాగాం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం 'సురేంద్ర సాయి దివ్యదృష్టి యోజన' కొరాపుట్ జిల్లా సంచార దృష్టి కేంద్రం ద్వారా శుక్రవారం నేత్ర పరీక్షలు నిర్వహించారు. మొత్తం 60 మందిని పరీక్షించారు. కెరాగాం, డెంగజగుడ, ఖగొధార, ఖొలబారితో పాటు పెండజామ, జామపుట్, నారాయణపట్న సమితి బిజాఘాట్ పంచాయతీ ముండగడితి, తొలగడితి గ్రామాల నుంచి ప్రజలు వచ్చారు. వీరిలో 19 మందిని కాటరాక్ట్ ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. వారందరినీ కొరాపుట్ నేత్ర ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఐదుగురికి కళ్లజోళ్లు ఇచ్చారు. మతలాపుట్ కమ్యూనిటీ హాస్పిటల్ వైద్యాధికారి డాక్టర్ సుమన్ కుమార్ పర్యవేక్షణలో నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ విజయ కుమార్ పరీక్షలు నిర్వహించారు.

ధాన్యం కొనకుంటే ఆందోళన



బొబియ మండీలో పడి ఉన్న ధాన్యం బస్తాలు

జయపురం: మండీలకు రైతులు తెచ్చిన ధాన్యం కొనుగోలు చేయకపోతే ఆందోళన చేపట్టి రాస్తోరోకో చేస్తామని బొబియ మండీ రైతులు అధికారులను హెచ్చరించారు. జయపురం సబ్‌డివిజన్ కొట్‌పాడ్ సమితి బొబియ మండీలో నేటి వరకు ఒక్క ధాన్యం గింజ కొనుగోలు చేయలేదని మా మాళి కృషక సంఘం నేతలు హెచ్చరించారు. 23 వ తేదీ, 25 వ తేదీలలో బొబియ లో మండీ తెరిచినా ధాన్యం కొనలేదని రైతులు కొరాపుట్ కలెక్టర్, జయపురం సబ్ కలెక్టర్, సివిల్ సప్లై అధికారులకు శుక్రవారం మెమోరాండాలు సమర్పించి ఫిర్యాదు చేశారు. బొబియ, సునారబెల్లి, నువాగాం రైతు ప్రతినిధులు సీతానాద్ బివ్వాల్, ప్రఫుల్ల బిశాయి, సంజయ బెహరాల నేతృత్వంలో రైతులు అధికారులను కలసి మెమోరాండం సమర్పించారు. బొబియ మండీకు రైతులు ధాన్యం తీసుకు వచ్చారని అయితే మిల్లర్లు ఎవరూ రాలేదని ఆరోపించారు. మండీలో వేలాది ధాన్యం బస్తాలు పడి ఉన్నాయని వారు వెల్లడించారు. బొబియ మండీలో ధాన్యం కొనేందుకు ఏ మిల్లర్లకు బాధ్యతలు అప్ప జెప్పారో వారి స్థానంలో మరెవరినైనా నియమించాలని వినతిలో రైతులు డిమాండ్ చేసినట్లు బొబియ కృషక సంఘ అధ్యక్షులు జగదీష్ పాణిగ్రహి మీడియాకు తెలియజేశారు.

బూటకపు రేషన్ కార్డుల ఏరివేత

- రాష్ట్ర పౌర సరఫరా, వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి కృష్ణ చంద్ర పాత్రో

భువనేశ్వర్:

రాష్ట్రంలో ఆహార భద్రత పథకం కింద జారీ అయిన రేషను కార్డుల్లో బూటకపు లబ్ధిదారుల ఏరివేతకు చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని రాష్ట్ర పౌర సరఫరా, వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి కృష్ణ చంద్ర పాత్రో తెలిపారు. బూటకపు రేషను కార్డుల ఏరివేత కోసం ఈ–కేవైసీ నిర్వహిస్తున్నారు. ఈ చర్యతో ఇప్పటి వరకు 40 లక్షల మంది బూటకపు రేషన్ కార్డు లబ్ధిదారులు బయట పడ్డారు. ఈ నేపథ్యంలో గత రెండున్నర దశాబ్దాలుగా ప్రభుత్వ పథకాల్ని అడ్డగోలుగా వినియోగించుకుంటున్న లబ్ధిదారుల్ని గుర్తించి ఏరివేయాలని నిర్ణయించుకున్నట్లు మంత్రి హెచ్చరించారు. ఆహార భద్రత తరహాలో పలు ప్రజాహిత పథకాల కార్యాచరణలో అవకతవకలపై ప్రభుత్వం ప్రత్యేక నిఘా వేసింది. రైతు లబ్ధి పథకాల్లో కూడా బూటకపు వినియోగదారులు ఉన్నట్లు విభాగం దృష్టికి వచ్చింది. ఈ మేరకు అతి త్వరలో కార్యాచరణ చేపట్టనున్నట్లు మంత్రి ప్రకటించారు. రాష్ట్రంలో ప్రజలకు ఆహార భద్రత కల్పించేందుకు పారదర్శక వ్యవస్థ పునరుద్ధరణ కోసం ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. దీనిలో ఈ–కేవైసీ విధానం కింద రేషను కార్డు లబ్ధిదారుల వాస్తవ స్థితిగతుల్ని సమీక్షిస్తుంది. ఈ విధానం కింద చేపట్టిన తనిఖీలో రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కో జిల్లాలో సగటున 1 లక్ష నుంచి లక్షన్నర మంది వరకు బూటకపు ఆహార భద్రత పథకం లబ్ధిదారులు ఉన్నట్లు తేలిందని మంత్రి వివరించారు.

వరి నాణ్యతతో రాజీ అసాధ్యం



కటక్ కలెక్టర్‌తో బీజేడీ నిజ నిర్ధారణ బృందం భేటీ

ఇటీవల కురిసిన వర్షాలతో రాష్ట్రంలో అత్యధిక జిల్లాల్లో వరి పంట నీట మునిగింది. దీంతో వరి నాణ్యత దిగజారుతుందని రైతులు వాపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నిర్ధారిత నాణ్యత ప్రామాణికలు ఎఫ్ఏక్యూ అతిక్రమించడం సాధ్యం కాదు. ఈ పరిమితిలో సాధ్యమైనంత వరకు నాణ్యత పునరుద్ధరణ కోసం ప్రత్యేక మార్గదర్శకాలతో రైతాంగాన్ని చైతన్యపరుస్తున్నట్లు మంత్రి వివరించారు. కేంద్ర ప్రభుత్వం నిర్ధారిత ప్రామాణికతో నాణ్యత ఖరారు కాకుంటే భారత ఆహార సంస్థ ఎఫ్‌సీఐ వరి ఆమోదించదు. నాణ్యతలో స్వల్ప తేడాతో స్థానిక వినియోగాలకు అక్కరకు వచ్చే వాటిని గుర్తించడంలో జిల్లా కలెక్టర్లు కీలక పాత్ర పోషిస్తారు. ఏమాత్రం అవకాశం ఉన్న రైతాంగం నుంచి వరి కొనుగోలు చేస్తారని మంత్రి హామీ ఇచ్చారు. ఏదీ సాధ్యం కాని పరిస్థితుల్లో బాధిత రైతాంగానికి ప్రభుత్వం సముచిత పరిహారం చెల్లిస్తుందని మంత్రి అభయం ఇచ్చారు.


నేడు అత్యవసర సమావేశం

అకాల వానలతో పంట నష్టంపై విభాగం లోతుగా



రాష్ట్ర పౌర సరఫరా, వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి కృష్ణ చంద్ర పాత్రో

సమీక్షిస్తుందని రాష్ట్ర రెవెన్యు, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్ కుమార్ పూజారి తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రత్యేకంగా సమావేశం అవుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రకృతి విపత్తుతో పంట నష్టం సంభవించిన ప్రాంతాల్లో వాస్తవ స్థితిగతుల క్షేత్ర స్థాయి నివేదికల్ని ఈ సమావేశంలో సమీక్షించడం జరుగుతుందన్నారు. దీని ఆధారంగా రైతాంగానికి పరిహారం మంజూరు ఖరారు చేసేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. ముఖ్యమంత్రి ఆమోదం మేరకు తుది నిర్ణయం ప్రకటించనున్నట్లు మంత్రి సురేష్ కుమార్ పూజారి తెలిపారు.



నీట మునిగిన పంట

అమ్మకానికి అడ్డు లేదు

అకాల వానలతో నీట తడిసిన వరి ఎండలో ఆరబెట్టి విక్రయించేందుకు పీడిత రైతాంగానికి పూర్తి వెసులుబాటు కల్పించారు. వచ్చే ఏడాది మార్చి నెల వరకు పలు ప్రాంతాల్లో మండీలు తెరిచే ఉంటాయి. స్థానిక స్థితిగతులకు అనుకూలంగా వరి విక్రయానికి రైతులకు జారీ చేసిన టోకెన్ల గడువు పొడిగించేందుకు జిల్లా కలెక్టర్లకు అధికారాలు కల్పించారు. ఈ అధికారాలతో కలెక్టర్లు 15 రోజుల వరకు టోకెన్ల కాల పరిమితిని విస్తరించగలుగుతారని మంత్రి తెలిపారు.

నష్టం అంచనా సక్రమంగా సాగాలి

బంగాళా ఖాతంలో ఏర్పడిన వాతావరణ మార్పులతో కురిసిన వానలు రాష్ట్ర రైతాంగాన్ని నిలువునా ముంచెత్తాయి. ఈ విపత్కర పరిస్థితుల్లో రైతాంగానికి సముచిత న్యాయం సకాలంలో అందజేయాలని బిజూ జనతా దళ్ నిజ నిర్ధారణ బృందం అభ్యర్థించింది. ఈ నేపథ్యంలో కటక్ జిల్లా కలెక్టరుతో ఈ బృందం శుక్రవారం సమావేశమైంది. క్షేత్ర స్థాయిలో పంట నష్టం అంచనా ప్రక్రియ లోపాలు లేకుండా సక్రమంగా నిర్వహిస్తే తప్ప రైతన్నకు న్యాయం జరగదని ఈ బృందం కలెక్టరుకు వివరించింది.

విపక్షం అడుగు జాడల్లో బీజేపీ సర్కారు

- 30 జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రుల నియామకం

భువనేశ్వర్:

పాలక పక్షం విపక్షాన్ని ఫాలో అయిన ఓ అరుదైన ఘటన రాష్ట్రంలో తారసపడింది. సుమారు రెండున్నర దశాబ్దాలు సుదీర్ఘంగా పాలన పగ్గాలు చేపట్టిన బిజూ జనతా దళ్ ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి పాలై అధికారం నుంచి దిగజారి విపక్ష హోదాతో సర్దుకుపోయింది. విపక్ష హోదాని బలంగా ప్రయోగించి ప్రజాదరణకు పునరుజ్జీవం పోసేందుకు నడుం బిగించింది. ప్రతికూల పరిస్థితుల నుంచి సమయ స్ఫూర్తితో బయటపడడంలో నవీన్ పట్నాయక్ వ్యూహం ప్రత్యేకం. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం మంత్రి మండలి ఏర్పాటు చేయడంతో విపక్ష హోదాలో బిజూ జనతా దళ్ పార్టీ ప్రముఖులకు ప్రాంతాలు, శాఖలు, విభాగాల వారీగా ప్రత్యేక బాధ్యతల్ని అప్పగించింది. రాష్ట్ర స్థాయిలో సమస్యల్ని శాసన సభలో ప్రవేశ పెట్టి పరిష్కారం చేసే బాధ్యతల్ని ఆయా అభ్యర్థులు నిర్వహిస్తారని బీజేడీ అధినేత ధీటుగా ప్రకటించారు. ఇటీవల అర్ధ సంవత్సరం పాలన పూర్తి చేసుకున్న మోహన్ చరణ్ మాఝి నేతృత్వంలో భారతీయ జనతా పార్టీ నవీన్ పట్నాయక్ వ్యూ హాన్ని ఆదర్శంగా తీసుకుంది. శాసన సభలో విపక్షం బిజూ జనతా దళ్ తరహాలో రాష్ట్రంలో 30 జిల్లాల బాగోగుల కోసం వివిధ జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రులను నియమించింది. ఇరువురు ఉప ముఖ్యమంత్రులు కనక వర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిడాతో పలువురు మంత్రులకు ప్రత్యేకంగా జిల్లా ఇన్‌చార్జి బాధ్యతలను కట్టబెట్టడం విశేషం. ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

- ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్ కటక్, జగత్‌సింగ్‌పూర్ జిల్లాల ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలు కేటాయించారు. ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడాకు బాలాసోర్, భద్రక్ జిల్లా బాధ్యతలు అప్పగించారు.
- రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేష్ కుమార్ పూజారికి సుందర్‌గడ్, దేవ్‌గఢ్, మంత్రి రవి నాయక్‌కు సోన్‌పూర్, బొలంగీర్ జిల్లాల బాగోగుల పర్యవేక్షణ కోసం నియమితులు అయ్యారు.
- కెంజొహర్, మయూర్‌భంజ్ జిల్లాల ఇన్‌చార్జి మంత్రిగా నిత్యానంద గోండ్, అంగుల్, సంబల్‌పూర్ జిల్లాలకు కృష్ణచంద్ర పాత్రో, గంజాం, గజపతి జిల్లాల బాధ్యతలను న్యాయ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్‌కు, ఝార్సుగుడ, బర్‌గఢ్ జిల్లాల బాధ్యతలను డాక్టరు ముఖేష్ మహాలింగ్‌కు, నవరంగ్‌పూర్, రాయగడ బాధ్యతలను బిభూతి జెనాకు కేటాయించారు.
- కంధమల్, బౌధ్ జిల్లాల ఇన్‌చార్జి మంత్రిగా కృష్ణ మహాపాత్రో, కలహండి, నువాపడా జిల్లాలకు గణేష్ రామ్ సింగ్ ఖుంటియా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులు కాగా సూర్య వంశీ సూరజ్ జాజ్‌పూర్, కేంద్రాపడా, ప్రదీప్ బలసమంత్ ఖుర్దా, నయాగఢ్, గోకులానంద మల్లిక్ కొరాపుట్, మల్కన్‌గిరి, సంపద్ చంద్ర స్వంయ్ ఢెంకనాల్, పూరీ జిల్లాల ఇన్‌చార్జి మంత్రులుగా బాధ్యతలు నిర్వహిస్తారు.

సక్రమంగా రెవెన్యూ సేవలు అందాలి

- మంత్రి సురేష్ పూజారి

రాయగడ: జిల్లాలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో సక్రమంగా రెవెన్యూ సేవలు అందాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి సురేష్ పూజారి అన్నారు. శుక్రవారం ఆయన రాయగడలో పర్యటించి, స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. తహసీల్దార్ ప్రియదర్శిని స్వయి, సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రా దేవి సంబంధిత శాఖ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీన, పేదవర్గాల్లో అర్హత ఉన్నవారికి ప్రభుత్వం 4 డెసిమిల్



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి పూజారి

స్థలాన్ని మంజూరు చేసేందుకు సన్నాహాలు చేస్తోందన్నారు. త్వరలో కొత్త రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సీఎస్ మనోజ్ ఆహుజా పదవీకాలం పొడిగింపు

- ఏడాది పాటు పొడిగించిన ప్రభుత్వం

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న మనోజ్ ఆహుజా ఈనెల ఆఖరున పదవీ విరమణ పొందాల్సి ఉంది. అయితే ఈ పరిస్థితుల్లో ఆయన పదవీ కాలం మరో ఏడాది పాటు పొడిగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో తొలిసారిగా పాలన పగ్గాలు చేపట్టిన భారతీయ జనతా పార్టీకి అనుకూలంగా ఆయన కార్యాచరణ ఇటీవల పలు భారీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడంతో, ప్రభుత్వం అయన పదవీకాలాన్ని పొడిగించడం గమనార్హం. కేంద్ర డిప్యూటేషన్ పూర్తి చేసుకున్న ఒడిశా కేడర్‌కు చెందిన 1990 బ్యాచ్ ఐఏఎస్ అధికారి మనోజ్ ఆహుజా, ఈ ఏడాది జూన్ 30న బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల హామీలను విజయవంతంగా అమలు చేయడంలో మనోజ్ ఆహుజా కార్యదక్షత అక్కరకు వస్తుందనే ఆశాభావంతో, ప్రభుత్వం ఆయన పదవీ కాలం పొడిగించారని చర్చ జరుగుతోంది.

ప్రభుత్వ వ్యూహాల్లో కీలకపాత్ర

చీఫ్ సెక్రటరీగా ప్రదీప్ కుమార్ జెనా పదవీకాలం జూన్ 30న ముగియడంతో ఆయన స్థానంలో మనోజ్ ఆహుజా నియమితులయ్యారు. ఈ 6 నెలల స్వల్ప వ్యవధిలో వివిధ ప్రభుత్వ వ్యూహాలు మరియు విధానాలను అమలు చేయడంలో ఆహుజా కీలక పాత్ర పోషించారు. ఆయన ప్రయత్నాలు ముఖ్యంగా బీజేపీ ఎన్నికల ప్రచార హామీలకు జీవం పోయడంపై కేంద్రీకృతమైనట్లు ప్రభుత్వం



సీఎస్ మనోజ్ ఆహుజా

మన్ననలు పొందారు. ఆయన ఆధ్వర్యంలో రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా సంకల్పించిన నౌకాదళ దినోత్సవం మరియు పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ) జాతీయ సదస్సు ఘనంగా విజయవంతం అయ్యాయి. త్వరలో రాష్ట్రంలో ప్రవాసీ భారతీయ దివస్ సదస్సు నిర్వహణకు ప్రభుత్వ సన్నాహాలు చురుకుగా సాగుతున్నాయి. అధికారుల వర్గంలో ప్రాంతీయ వివక్ష, అవాంఛనీయ పెత్తనానికి తెర దించి సమతుల్య భావంతో అందరిని ఒకే తాటిపైకి తేవడంలో మనోజ్ ఆహుజా సేవలు ప్రభుత్వం మన్ననలు పొందాయి. మనోజ్ ఆహుజా అపారమైన అధికారిక పాలన అనుభవం సానుకూలంగా మలచుకుని ప్రభుత్వానికి సవాలు విసురుతున్న పలు భావి ప్రణాళికలు, పథకాలు, కార్యక్రమాల్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఆయన పదవీ కాలం ప్రయోజనకరంగా ఉంటుందనే యోచన వాస్తవ ఫలితాలు వేచి చూడాల్సిందే.

7న ధాన్యం కొనుగోలు మండీలు ప్రారంభం

- డీఎల్‌సీసీ సమావేశంలో కలెక్టర్ వెల్లడి

పర్లాకిమిడి: వరి కోతలు కోసిన అనంతరం అకాల వర్షాలకు గజపతి జిల్లాలో ఖరీఫ్ ధాన్యం పాడైన దృష్ట్యా అనేక మంది రైతులు కలెక్టరేట్ వద్దకు వచ్చి ఆందోళన చేస్తున్నారు. దీంతో శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్ డీఎల్‌సీసీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, జిల్లా పరిషత్ అధ్యక్షులు గవర తిరుపతిరావు, ఏడీఎం రాజేంద్ర మింజ్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రఫుల్ల కుమార్ నాయక్, జిల్లా ముఖ్య వ్యవసాయ అధికారి ఎం.రాంప్రసాద్ పాత్రో, సబ్‌కలెక్టర్ అనుప్ పండా, అసిస్టెంటు రిజిస్ట్రార్ కోపరేటివ్ సొసైటీస్ అధికారి హరి హారశెరి, తహసీల్దార్ నారాయణ బెహరా, రైతు సంఘం నాయకులు సూర్యనారాయణ పటాన్నయక్, మిల్లర్లు సమావేశంలో పాల్గొన్నారు. తడిచిన ధాన్యాన్ని రైతులు ఇప్పుడిప్పుడే ఆరబెడుతున్న నేపథ్యంలో ఈనెల 30వ తేదీకి బదులుగా జనవరి ఏడో తేదీన ధాన్యం కొనుగోలు కేంద్రాలు (మండీ) తెరుస్తామని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అధికారులతో అన్నారు. అలాగే గుసానిలో ఉప్పలాడ మండీ కేంద్రం, కాశీనగర్‌లో ధాన్యం స్టోరేజీ గోదాములు యుద్ధప్రాతికపదిగా మరమ్మతులు చేపట్టడంతోపాటు కొత్తవి నిర్మించాలని కలెక్టర్‌తోపాటు ప్రజాప్రతినిధులు నిర్ణయించారు. జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని



సమావేశంలో కలెక్టర్ బిజయ కుమార్ దాస్, ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

అన్నారు. మోహానా బ్లాక్ లుహాగుడి వద్ద గంజాం జిల్లా ధాన్యాన్ని ఎందుకు నిల్వ ఉంచుతున్నారని జిల్లా పరిషత్ అధ్యక్షులు గవర తిరుపతి రావు అధికారులను ప్రశ్నించారు. ఇలా చేస్తే గజపతి జిల్లా రైతుల ధాన్యాన్ని ఎక్కడ స్టోరేజీ చేస్తారని నిలదీశారు.

పంటనష్టం మాటేమిటి?

జిల్లాలో ముఖ్యంగా గుసాని సమితి, కాశీనగర్‌లలో అకాల వర్షాలవల్ల ధాన్యం తడిసిపోయి రంగు మారిపోయింది. రంగుమారిన ధాన్యం ప్రభుత్వం ఒక ధరను ధ్రువీకరించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతు ప్రతినిధులు సూర్యనారాయణ పట్నాయక్ సమావేశంలో డిమాండ్ చేశారు. అలాగే గంజాం జిల్లా నుంచి వేల మెట్రిక్ టన్నుల ధాన్యం గజపతి జిల్లాలో నిల్వలు చేయడం తగదని జిల్లా పరిషత్ అధ్యక్షులు గవర తిరుపతిరావు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

ధ్వజమెత్తారు.

పది రోజుల తరువాత ధాన్యం కొనుగోలు:ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

డీఎల్‌సీసీ సమావేశం తరువాత ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి విలేకరులతో మాట్లాడుతూ.. రైతుల వద్ద నుంచి మరో పది రోజుల తరువాతే మండీల వద్ద ధాన్యం కోనుగోలు చేస్తామని కలెక్టర్ ఈరోజు సమావేశంలో నిర్ణయించినట్టు పేర్కొన్నారు. ఈలోగా రైతులు అధైర్య పడవద్దన్నారు. సమావేశంలోజిల్లా కృషక్ మోర్చా అధ్యక్షులు (బీజేపీ) ప్రశాంత కుమార్ పాలో, కాశీనగర్ సమితి మిల్లర్లు రాం ప్రసాద్, మధు, అసిస్టెంట్ పౌరసరఫరాల శాఖ అధికారి సూరజ్ పాత్రో పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళ ఆత్మహత్య



సునాదేయి దురువ మృతదేహం

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కుంద్ర సమితి అసన గ్రామ పంచాయతీ కాదంబబెడ గ్రామంలో మహిళ విషం తీసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈమె ధనీరాం దురువ భార్య సునాదేయి దురువ(36)గా పోలీసులు తెలిపారు. గురువారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో సునాదేయి దురువ క్రిమి సంహారక మందుతాగి స్పృహ కోల్పోయింది. గమనించిన భర్త వెంటనే అంబులెన్స్‌ను రప్పించి కుంద్ర కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్ సునాదెయి.. సునాదేయి దురువ మరణించినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసు అధికారి చిత్త రంజన్ ప్రధాన్ కేసు నమోదు చేసి.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు కారణం తెలియరాలేదని పోలీసులు చెప్పారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

చైతీ ఉత్సవాలు తాత్కాలికంగా రద్దు

- జిల్లా కలెక్టర్ పట్వారి



జిల్లా కలెక్టర్ పట్వారి

రాయగడ: స్థానిక గోవింద చంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 26 నుంచి ప్రారంభమైన చైతీ ఉత్సవాలను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఫరూల్ పటావ్రి ప్రకటించారు. భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి కేంద్ర ప్రభుత్వం సంతాప దినాలను ప్రకటించిన నేపథ్యంలో ఈ మేరకు చైతీ ఉత్సవాలను రద్దు చేస్తున్నట్లు ఆమె ఒక ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. కాగా జనవరి రెండు నుంచి నాలుగో తేదీ వరకు ఈ ఉత్సవాలు యధావిధిగా కొనసాగుతాయని వెల్లడించారు.

రాష్ట్ర న్యాయ కమిషన్ ఏర్పాటు



జస్టిస్ బిశ్వనాథ్ రథ్

భువనేశ్వర్: ప్రభుత్వం రాష్ట్ర న్యాయ కమిషన్ ఏర్పాటు చేసింది. 6 మంది సభ్యులతో కూడిన కమిషన్ అధ్యక్షునిగా రాష్ట్ర హైకోర్టు విరామ న్యాయమూర్తి జస్టిస్ బిశ్వనాథ్ రథ్ నియమితులయ్యారు. సీనియర్ న్యాయవాదులు సూర్య ప్రకాష్ మిశ్రా, సౌరచంద్ర మహాపాత్రో సభ్యులుగా, ప్రభుత్వ అదనపు కార్యదర్శి ఎక్స్‌అఫీషియో మెంబర్ సెక్రటరీగా, రాష్ట్ర అడ్వకేట్ జనరల్ పీతాంబర ఆచార్య మరియు న్యాయశాఖ ప్రముఖ కార్యదర్శి ఎక్స్‌అఫీషియో సభ్యులుగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర న్యాయశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఒడిశా ధాన్యం సీజ్

కంచిలి: ఒడిశా సరిహద్దు నుంచి ఎటువంటి పత్రాలు లేకుండా వ్యాన్ ద్వారా వస్తున్న ధాన్యం లోడ్‌ను శుక్రవారం జక్కర గ్రామం వద్ద స్థానికులు అడ్డుకున్నారు. వెంటనే సీఎస్‌డీటీ పి.కూర్మారావుకు సమాచారం అందించారు. చాలా కాలంగా సాగుతున్న ఈ తంతును స్థానికులు గమనించి చివరికి జక్కర గ్రామం వద్ద లోడుతో వెళ్తుండగా పట్టుకున్నారు. 80 కిలోలు చొప్పున మొత్తం 140 బస్తాలు ఉన్నాయని, వీటిని సీజ్ చేశామని సీఎస్‌డీటీ కూర్మారావు తెలిపారు. వీటిని కంచిలిలో సుందరం ట్రేడర్స్ మిల్లు వద్ద దించి ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు చెప్పారు.

కేంద్ర మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

- కాంగ్రెస్ నాయకుల డిమాండ్



డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న బాహిణీపతి

జయపురం: రాజ్యాంగ ప్రధాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వాఖ్యలు చేసి అవమానించిన కేంద్రహోం మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మీణాక్షీ బాహిణీపతి నేతృత్వంలో కొరాపుట్ పట్టణంలో అమిత్‌షాకు వ్యతిరేకంగా గురువారం భారీ ర్యాలీ చేశారు. తొలుత పట్టణంలోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే బాహిణీపతి తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారంతా ప్లకార్డులు పట్టుకొని జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా జరిపి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ నుద్దేశించిన మెమోరాండాన్ని జిల్లా కలెక్టర్ వి.కీర్తివాసన్‌కు అందజేసారు. అమిత్‌షాపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మీణాక్షీ బాహిణీపతి డిమాండ్ చేశారు. ఆందోళనలో జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి, పొట్టంగి ఎమ్మెల్యే, విధానసభలో కాంగ్రెస్ నేత రామచంద్ర కడమ్, పార్టీ పర్యవేక్షకులు మానస్ మల్లిక్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జగదీష్ కొళ్ల, కొట్‌పాడ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనామ్ దియాన్, యూత్ కాంగ్రెస్ నేత రూపక్ తురుక్, జిల్లా పరిషత్ సభ్యులు మిహిర్ కులదీప్, జయపురం మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, కొరాపుట్ సమితి అక్ష్యక్షురాలు నమిత మరిఖ, అధికసంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీలో కాంగ్రెస్ శ్రేణులు



ధర్నాలో ప్రసంగిస్తున్న మీణాక్షీ బాహిణీపతి తదితరులు



ధర్నాలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

మాజీ ప్రధానికి శ్రద్ధాంజలి



దివంగత ప్రధాన మంత్రి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి



రాయగడ: శ్రద్ధాంజలి ఘటిస్తున్న కాంగ్రెస్ నాయకులు



నబరంగ్‌పూర్‌లో మన్మోహన్ సింగ్‌కి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: భారత మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మృతిపై రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా స్థానిక లోక్ సేవా భవనం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన ప్రసంగించారు. ఆర్థిక రంగంలో మన్మోహన్ సింగ్ అపార జ్ఞానం, దక్షత ప్రపంచ దేశాల గుర్తింపు సాధించిందని, ఆయన ఆర్థిక సంస్కరణలు భారత దేశానికి ప్రత్యేక ఉనికిని ఆవిష్కరించాయని ముఖ్యమంత్రి కొనియాడారు. ప్రధాన మంత్రిగా దేశ సమగ్ర పురోగతి వేగవంతం చేసి పాలన దక్షత చాటుకున్నారని, ఆయన జ్ఞానం, విధేయత, సరళత, అమాయక స్వభావం రాజకీయ రంగంలో ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకుందన్నారు.

రాయగడలో..

రాయగడ: భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు స్థానిక కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఘన నివాళులు అర్పించారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక, బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికక పలువురు పాల్గొని మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు.

కొరాపుట్‌లో..

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని టౌన్ హాల్‌లో అఖిల పక్ష సంతాప సభ జరిగింది. కార్యక్రమంలో బీజేపీకిచెందిన నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి, బీజేడీకి చెందిన మాజీ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని, డీసీసీ మాజీ అధ్యక్షుడు మున్నా త్రిపాఠి తదితరులు మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించారు.

రైతులను ఆదుకుంటాం



ధాన్యం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రూపేష్

- ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి



కోర్సంద గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న దృశ్యం

పర్లాకిమిడి: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకుంటామని పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి అన్నారు. గుసాని సమితిలోని కొర్సండ, బుసుకిడి, బాగుసాల, అంకుడు తాటిపట్టి, గురండి, సర్దాపురం గ్రామాల్లో శుక్రవారం పర్యటించి రైతులతో మాట్లాడారు. రంగుమారిన ధాన్యం కొనుగోళ్లకు అధికారులతో చర్చించామని, మరో పది రోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తారని భరోసా ఇచ్చారు. అలాగే రెవెన్యూ అధికారులు గుసాని సమితిలో పర్యటిస్తారని, ఎంతమంది రైతులు నష్టపోయారో అంచనా వేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గుసాని సమితి అధ్యక్షుడు ఎస్.వీర్రాజు, కాశీనగర్ బీజేడీ నాయకులు పి.మధు, బీజేడీ రాష్ట్ర సాధారణ కార్యదర్శి ప్రదీప్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గోనెసంచిలో మృతదేహం



సీతాసాగరంలో కనిపించిన కృష్ణచంద్ర పండా శవం



సీతాసాగరం నుండి బయటకు తీసిన గోనెసంచి

పర్లాకిమిడి: పట్టణంలో కాపువీధికి చెందిన కృష్ణచంద్ర పండా అనే ఒక వ్యక్తి రెండు రోజుల క్రితం అదృశ్యమయ్యాడు. దీనిపై కుటుంబ సభ్యులు ఆదర్శ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే శుక్రవారం మధ్యాహ్నం ఒడిశా–ఆంధ్రప్రదేశ్ సరిహద్దు సీతాసాగరంలో ఓ గోనెసంచిలో శవమై తేలాడు. స్థానికులు పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఐఐసీ ప్రశాంత్ భూపతి పోలీసు సిబ్బంది, అగ్నిమాపక దళంతో కలిసి గోనె సంచిని బయటకు తీశారు. అందులో కృష్ణచంద్ర పండా మృతదేహం ఉండడంతో అంతా నిశ్చేష్టులయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించి నిర్ధారించుకున్నారు. మృతదేహాన్ని కేంద్రాస్పత్రికి తరలించారు. కృష్ణచంద్ర పండాను ఎవరో హత్య చేసి గోనెసంచిలో మూటకట్టి సీతాసాగరంలో పడేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. దీనిపై ఆదర్శ పోలీసు స్టేషన్ అధికారి (ఐఐసి) ప్రశాంత్ భూపతి కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే కారుకు నిప్పు



సర్క్యూట్ హౌస్ ఆవరణలో దగ్ధమైన మోటారు వాహనాలు

భువనేశ్వర్: ఫుల్బాణి నియోజక వర్గం శాసన సభ్యుడు ఉమా చరణ్ మల్లిక్ కారుకు నిప్పు పెట్టారు. ఫుల్బాణి సర్క్యూట్ హౌసు ఆవరణలో నిలిపిన కారుకు గురువారం రాత్రి ఆగంతకులు నిప్పు పెట్టారు. ఈ మంటల్లో బైక్, స్కూటీ దగ్ధమయ్యాయి. ప్రభుత్వ కార్యక్రమాలు పురస్కరించుకుని సందర్శించిన ఎమ్మెల్యే రాత్రి విడిదిగా బస చేసిన సందర్భంగా ఈ సంఘటన చోటు చేసుకుంది. ఆగంతుకుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈ ప్రమాదంలో వ్యక్తిగత అంగ రక్షకుడు బొనామాలి నాయక్ బైక్, సర్క్యూట్ హౌసు సిబ్బంది కృపాసింధు మాఝి స్కూటీ పూర్తిగా దగ్ధమయ్యాయి. ఎమ్మెల్యే ఉమాచరణ్ మల్లిక్ కారు పాక్షికంగా దగ్ధమైంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



గాయపడిన అజయ్‌కుంద బెహరా

నందిగాం: మండలంలోని లట్టిగాం సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలోయువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇచ్ఛాపురం సమీపంలోని ఒడిశా రాష్ట్రం బాసుదేవ్‌పేటకు చెందిన అజయ్‌కుంద బెహరా ఇచ్ఛాపురం నుంచి ద్విచక్రవాహనంపై శ్రీకాకుళం వెళ్తుండగా నందిగాం మండలం లట్టిగాం వద్దకు వచ్చే సరికి కుక్క రావడంతో ఢీకొట్టి పడిపోయాడు. తీవ్రగాయాల పాలై అపస్మారక స్థితికి చేరుకోవడంతో గమనించిన స్థానికులు 108 అంబులెన్సులో టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఆరా తీసి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మెరుగైన చికిత్స కోసం క్షతగాత్రున్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అజయ్ కుమార్ ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం.

నేడు ఐఐటీ స్నాతకోత్సవం



ఐఐటీ స్నాతకోత్సవం విలేకర్ల సమావేశం

భువనేశ్వర్: విద్యార్థి జీవితంలో స్నాతకోత్సవం మరిచిపోలేని అత్యద్భుత పండగ. ఉత్తీర్ణత శిఖరాల అధిరోహణకు ఈ ఉత్సవం ప్రేరణగా నిలుస్తుంది. ఈ కార్యక్రమాన్ని సందేశాత్మకంగా నిర్వహించేందుకు సకల ఏర్పాట్లు పూర్తి చేశామని స్థానిక భారతీయ సాంకేతిక సంస్థ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసరు శ్రీపాద కర్మాలకర్ తెలిపారు. ఈ సంస్థ 12వ, 13వ స్నాతకోత్సవాల్ని ఉమ్మడిగా జరుపుకుంటోంది. ఈ నెల 28వ తేదీన క్యాంపస్ ఆడిటోరియం ప్రాంగణంలో ఉత్సవ వేదిక సిద్ధం చేశారు. ఈ సందర్భంగా 2022–23, 2023–24 విద్యా సంవత్సరాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అతిథి ప్రముఖులు పట్టాలు ప్రదానం చేస్తారు. సమగ్రంగా ఈ రెండు విద్యా సంవత్సరాల్లో ఉత్తీర్ణత సాధించిన 1,388 మందికి పట్టాలు ప్రదానం చేయనున్నట్లు డైరెక్టరు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల్ని ఉద్దేశించి ప్రముఖ పరిశోధకులు, విద్యావేత్తలు ప్రసగించనున్నారు. వీరిలో భారత ప్రభుత్వం ప్రముఖ వైజ్ఞానిక సలహాదారుడు ప్రొఫెసరు అజయ కుమార్ సూద్, అణు శక్తి సంస్థ, విభాగం కార్యదర్శి డాక్టరు అజిత్ కుమార్ మహంతి, భారత ప్రభుత్వ వైజ్ఞానిక, సాంకేతిక విభాగం కార్యదర్శి ప్రొఫెసరు అభయ్ కర్ణాదికర్ ఉన్నారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ముఖ్య అతిథిగా స్నాతకోత్సవ ప్రసంగం కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో గ్రాడ్యుయేటు కార్యక్రమాల డీన్ ప్రొఫెసరు సంతాను పాల్, పోస్టు గ్రాడ్యుయేటు, పరిశోధన కార్యక్రమాల డీన్ ప్రొఫెసరు చంద్ర శేఖర్ ఎన్. భెండే, రిజిస్ట్రారు బామదేవ్ ఆచార్య మాట్లాడారు.

కబడ్డీ పోటీల విజేతలకు అభినందనలు



జిల్లా కబడ్డీ క్రీడాకారులతో డీఎస్‌డీఓ శ్రీధర్‌రావు, సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రపోటీల్లో సాధించిన పోరాటస్ఫూర్తితో జాతీయ పోటీల్లోనూ సత్తాచాటాలని డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు పిలుపునిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో ఈ నెల 22 నుంచి 24 వరకు జరిగిన 50వ ఏపీ రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలబాలికల కబడ్డీ చాంపియన్‌షిప్–2024 పోటీల్లో శ్రీకాకుళం జిల్లా జట్లు విజేతలగా నిలిచిన విషయం తెలిసిందే. జిల్లాకు వచ్చిన క్రీడాకారులను, కోచ్‌లను, ప్రోత్సహిస్తున్న కబడ్డీ సంఘ బాధ్యులను శుక్రవారం స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియంలో అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు నక్క రామకృష్ణ, కార్యదర్శి సాదు ముసలినాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి సాధు శ్రీనివాసరావు, డీఎస్ఏ కబడ్డీ కోచ్ సింహాచలం, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

దూసుకొచ్చిన ఇసుక లారీ

ఆమదాలవలస: మండలంలోని శ్రీహరిపురంలో అలికాం–బత్తిలి ప్రధాన రహదారిపై గురువారం రాత్రి అధిక బరువుతో ప్రయాణిస్తున్న ఇసుక లారీ అదుపు తప్పికిరాణాషాపు వైపు దూసుకెళ్లింది. ఆ సమయంలో షాపు మూసి ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం ర్యాంపు నుంచి పార్వతీశ్వరునిపేట వైపు వెళ్లాల్సిన లారీ పొరపాటున ఆమదాలవలస పట్టణం వైపు దారి తెలియక తీసుకురావడంతో డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడం, వెంటనే టైర్ పంక్చర్ కావడంతో ఈ ఘటన జరిగిందని స్థానికులు చెబుతున్నారు. లారీకి అనుమతులు కూడా లేనట్లు సమాచారం. తరచూ అధిక లోడు ఇసుకతో లారీలు రాకపోకలు సాగిస్తున్నా అధికారులు, పోలీసులు పట్టించుకోకపోవడంపై స్థానికులు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

పల్లిశ్రీ మేళాలో జన సందడి



స్టాల్స్‌ను సందర్శిస్తున్న జనం



అటవీ శాఖ ఏర్పాటు చేసిన ప్రదర్శన

రాయగడ: చైతీ ఉత్సవాల్లో భాగంగా స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన పల్లిశ్రీ మేళాలో శుక్రవారం జన సందడి కనిపించింది. భారత మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతి చెందడంతో సంతాప దినాలుగా కొనసాగుతున్న నేపథ్యంలో ఉత్సవాలను తాత్కాలికంగా జిల్లా యంత్రాంగం రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో చైతీ ఉత్సవ వేదిక బోసిపోయింది. అయితే ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారు ఈ పల్లిశ్రీ మేళాలో తమ చేతి వృత్తి పనులకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేశారు. అదేవిధంగా సొరకాయలతో రూపొందించిన వివిధ కళాకృతులు అబ్బురపరుస్తున్నాయి. మట్టితో రూపొందే వస్తువులు, వెదురుతో రూపొందించిన కళాకృతులు ఈ మేళాలో ఆకర్షిస్తున్నాయి. జన సందడి ఎక్కువగా ఉండడంతో పోలీసుల బందోబస్తు యథావిధిగా కొనసాగుతోంది.



మట్టితో చేసిన కళాకృతులు



వెదురు కర్రతో రూపొందిన వస్తువులు



సొరకాయతో రూపొందిన కళాకృతులు

• సైకత సంతాపం



మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మృతిపై అంతర్జాతీయ సైకత శిల్పి పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ కళాత్మకంగా సంతాపం ప్రకటించారు. పూరీ సాగర తీరంలో దివంగత ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ సైకత శిల్పం తీర్చిదిద్దారు.

- భువనేశ్వర్/పూరీ

క్లుప్తంగా

ఖాతాదారులకు ఉత్తమ సేవలు

- జేసీ ఎస్. సేతుమాధవన్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్

విజయనగరం అర్బన్: ఉద్యోగులు పని సామర్థ్యాన్ని మెరుగుపరుచుకుని ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జ్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ బోర్డు సభ్యులకు సూచించారు. డీసీసీబీ బోర్డు 7వ సమావేశం పర్సన్ ఇన్‌చార్జ్ సేతు మాధవన్ అధ్యక్షతన శుక్రవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు బ్యాంక్ సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇవ్వాలన్నారు. సిబ్బందిలో జవాబుదారీతనం పెంచే విధానాలను అమలు చేయాలని ఆదేశించారు. కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న ప్రస్తుత బ్యాంక్ ఇన్‌చార్జ్ సీఈఓ సీహెచ్ ఉమామహేశ్వరరావు పదవీకాలాన్ని మరో మూడేళ్లకు పొడిగిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం టి.నాగార్జున, జిల్లా సహకార అధికారి పి.రమేష్, ఆప్కాబ్ డీజీఎం షేక్ అఫ్సార్ జహాన్ పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణ



పీకేఆర్‌పురం రెవెన్యూలో మట్టి నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

వేపాడ: ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్ట్‌లో భాగంగా వీరనారాయణం, పీకేఆర్ పురం గ్రామ సరిహద్దుల్లో నిర్మించనున్న డ్యామ్‌కు సంబంధించి మట్టి నాణ్యత పరిశీలన పనులు ప్రారంభమయ్యాయి. సుజల స్రవంతి ప్రాజెక్ట్ డీఈ సుప్రజ ఆధ్వర్యంలో మూడు రోజులుగా మట్టి నాణ్యత పరిశీలన పనులు చేపడుతున్నారు. ఈ మేరకు యంత్రాల సహాయంతో మట్టి నమూనాలు సేకరిస్తున్నారు.

రైతులకు సమాచారం ఇవ్వకుండా....

ప్రాజెక్ట్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు సమాచారం ఇవ్వకుండా మట్టి నాణ్యత పరిశీలన పనులు చేపట్టడం సమంజసం కాదని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ అన్నారు. తక్షణమే రైతులను సంప్రదించిన చర్చించిన తర్వాతే పనులు ప్రారంభించాలని స్పష్టం చేశారు. లేనిపక్షంలో పనులను అడ్డుకుంటామని చెప్పారు.

30,31 తేదీల్లో ధర్నాలు

- ఆర్టీసీ ఈయూ జోన్ కమిటీ ప్రకటన

విజయనగరం అర్బన్: కూటమి ప్రభుత్వం వచ్చాక ఆర్టీసీలో జరుగుతున్న అక్రమ సస్పెన్స్‌లు, ఉద్యోగ వ్యతిరేక కార్యక్రమాలను నిరసిస్తూ ఈ నెల 30, 31వ తేదీల్లో విజయనగరం జోన్ పరిధిలోని 19 డిపో కార్యాలయాల ఎదుట ధర్నా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ కమిటీ ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం స్థానిక డిపో ప్రాంగణంలోని సంఘం కమిటీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన సమయంలో ధర్నా కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానించారు. జోన్–1 పరిధిలోని 19 డిపోలు, జోనల్ వర్క్‌షాప్‌లకు సంబంధించిన సమస్యలపై ఇచ్చిన పలు వినతులను అధికారులకు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారులు 1/2019 సర్క్యులర్‌ను పక్కనబెట్టి ఇష్టం వచ్చినట్లు సస్పెన్షన్లు విధిస్తున్నారని తెలిపారు. ధర్నాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జోనల్ ఇన్‌చార్జ్ పి.భానుమూర్తి, అధ్యక్షుడు కేజీ సుభాకర్, కార్యదర్శి బీకే మూర్తి, నాయకులు వై.రాము, నారాయణ, సత్యవతి, పద్మ, కేబీ లత, కేవీ రమణ, బి.జనార్దన, రవికాంత్, మూర్తి, శ్రీనివాస్, చందు, సుందరరావు పాల్గొన్నారు.

పార్వతీపురం జిల్లాకు ఇద్దరు సీఐలు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లాకు ఇద్దరు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న ఎస్.రమేష్‌ను పార్వతీపురం మన్యం జిల్లా డీసీఆర్‌బీకి.. ఊయక రమేష్‌ను స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు.

మధుపాడలో వరుస దొంగతనాలు

గజపతినగరం: మండలంలోని మధుపాడలో వరుస దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గ్రామానికి చెందిన తెన్నేటి నరసింహమూర్తి కుటుంబ సభ్యులతో కలిసి ఇటీవల హైదరాబాద్ వెళ్లారు. అయితే ఈ నెల 26న నరసింహమూర్తి ఇంటి తలుపులు పగులగొట్టి ఉండడాన్ని ఆయన సోదరుడు గుర్తించి పోలీసులకు, అన్నయ్యకు సమాచారం అందించారు. వారు వచ్చి పరిశీలించంగా.. మూడు కిలలోల వెండి, టీవీ, రెండు కేజీల ఇత్తడి సామగ్రి పోయినట్లు గుర్తించారు. అలాగే ఇంటికి సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి గుడి హుండీని కూడా దొంగలు ఎత్తుకుపోయారు. హుండీలో సుమారు పది వేల రూపాయలు ఉంటుందని భక్తులు చెబుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై కె. లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- గుర్రపుడెక్కతో మూసుకుపోతున్న సాయన్న చానల్
- ఆధునీకరణపై దృష్టి సారించని అధికారులు
- ముంపుతో ఖరీఫ్ పంట నష్టపోయిన రైతులు
- రబీలో కూడా నీట మునిగిన పంట



రామారాయపురం వద్ద ఖరీఫ్‌లో పొలాలపై నుంచి ప్రవహిస్తున్న నీరు (ఫైల్)

పాలకులారా... అన్నదాత గోడు పట్టదా..!

సంతకవిటి: ఒకప్పుడు పచ్చని పంట పొలాలతో అలరారిన ప్రాంతం సాయన్నగెడ్డ పరీవాహక ప్రాంతం. కాలక్రమంలో సాయన్న చానల్ పరిధిలో వ్యవసాయం చేయాలంటే రైతుకు సాహసంగా మారింది. అయినప్పటికీ అన్నదాత మాత్రం వ్యవసాయాన్ని విడిచి పెట్టడం లేదు. వివరాల్లోకి వెళితే.. సాయన్న చానల్ మండలంలోని మాధవరాయపురం నుంచి వాల్తేరు వరకు ప్రవహిస్తోంది. ఈ చానల్‌లో గుర్రపుడెక్క, తూడికాడ, రెల్లి బలంగా పెరగడంతో నీరు కిందకు ప్రవహించడం కష్టంగా మారడంతో.. తన ప్రవాహ దిశను మార్చుకుని పచ్చని పంట పొలాల వైపు సాగుతోంది. దీంతో బూరాడపేట, హంజరాం, రామారాయపురం, షాలీపేట, మల్లయ్యపేట, తదితర గ్రామాల్లో రైతులు తమ పంటలను ప్రతిఏటా నష్టపోతున్నారు. ఏమాత్రం వర్షం పడిన పంటలు నీట మునుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆధునీకరణపై దృష్టి సారించాలి..

పాలకులు, అధికారులు సాయన్న చానల్ ఆధునీకరణపై దృష్టి సారించి అన్నదాతను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి చానల్‌ను ఆధునీకరించాలని అన్నదాతలు విన్నవించుకుంటున్నా అటు అధికారులు గాని ఇటు ప్రజా ప్రతినిధులు గాని పట్టించుకోవడం లేదు. వచ్చే ఖరీఫ్ నాటికైనా ఆధునీకరణ పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



రబీలో నీట మునిగిన అపరాల పంట



రామారాయపురం వద్ద గుర్రపుడెక్కతో ఉన్న సాయన్న చానల్

రబీలో కూడా పంట నష్ట పోయాం



ఇటీవల ఎడతెడిపి లేకుండా వర్షం కురవడంతో అపరాలు నీట మునిగాయి. వాటితో పాటు పండించిన వరిని పొలంలోనే కుప్పలుగా పెట్టడంతో కుప్పలు కూడా తడిచిపోయి నష్టపోతున్నాం. సాయన్న చానల్ ఆధునీకరణ చేస్తే తప్ప మా ప్రాంతానికి ఈ సమస్య తప్పదు. – ఎన్ని పద్మావతి, మహిళా రైతు, రామారాయపురం

సమస్యల పరిష్కారానికే ‘వెల్ఫేర్ డే’



పోలీస్ సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికే పోలీస్ వెల్ఫేర్ డేను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ కార్యాలయంలో వెల్ఫేర్ డే కార్యక్రమంలో భాగంగా పలువురు సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. సిబ్బంది తెలియజేసిన వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను ఎస్పీ స్వయంగా నోట్ చేసుకున్నారు. సమస్యలను పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపడతానని తెలిపారు.

అధికారుల సహకారం తప్పనిసరి



మాట్లాడతున్న ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆశుతోష్ శ్రీ వాస్తవ

- సబ్ కలెక్టర్ అశోతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురం టౌన్: అధికారుల సహకారంతో జిల్లాలో రక్తహీనత నివారణ సాధ్యమని పార్వతీపురం సబ్ కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆశుతోష్ శ్రీవాస్తవ అభిప్రాయపడ్డారు. పార్వతీపురం మండలం కృష్ణపల్లిలో ఎనిమియా యాక్షన్ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా అధికారులు, వైద్యాధికారులు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలో రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల వివరాలను అడిగి తెలుసుకున్నారు. హిమోగ్లోబిన్ శాతం వివరాల రికార్డులను పరిశీలించారు. కొందరిలో కనిష్ఠ స్థాయి కన్నా హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉండడాన్ని గమనించారు. ఇకపై ప్రతినెలా హిమోగ్లోబిన్ శాతం వృద్ధి చెందేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. రక్తహీనతను గుర్తించే ముందు అందుకు గల కారణాలను విశ్లేషించి, వారి ఆరోగ్యం మెరుగు పడేందుకు కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందించే పౌష్టికాహారన్ని (టీహెచ్ఆర్) గర్భిణీలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు గృహ సందర్శనలు చేసి గర్భిణులు, బాలింతలు ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు ప్రతిరోజూ వేసుకునేలా చైతన్యపరచాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు, సీడీపీఓ బి. శ్రీనివాస్, వివిధ శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ మలవిసర్జన రహిత జిల్లాగా తీర్చిదిద్దుకుందాం..

- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



పనసభద్ర గ్రామంలో రక్తహీనత నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



అనసభద్ర గ్రామంలో విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

మక్కువ: బహిరంగ మలవిసర్జన లేని ప్రాంతంగా పార్వతీపురం మన్యం జిల్లాను తీర్చిదిద్దుకుందామని కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ అన్నారు. మండలంలో పనసభద్ర గ్రామంలో ‘రక్తహీనత రహిత మన్యం జిల్లా మన లక్ష్యం’ అనే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించుకోవాలన్నారు. లేని వారికి కొత్తగా మరుగుదొడ్లు మంజూరు చేయాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజినీర్లను ఆదేశించారు. అధికారులతో పాటు ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరిస్తేనే ప్రగతి సాధ్యమవుతుందని చెప్పారు. పరిశుభ్ర పార్వతీపురంను తీర్చిదిద్దడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని.. లబ్ధిదారులు వాటిని సక్రమంగా వినియోగించుకోకపోతే ఫలితం ఉండదని చెప్పారు. వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నవారు కూడా బహిరంగ మలవిసర్జనకు అలవాటు పడడం బాధాకరమన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలంటే పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. ప్రతిరోజూ చెత్తను సేకరించి, వీధులను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సేకరించిన చెత్త నుంచి సంపదను సృష్టించడం ద్వారా పంచాయతీకి ఆదాయం పెరుగుతుందన్నారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన కాలువలను పరిశీలించారు. కొలతల మేరకు నిర్మాణాలు జరిపించారా? లేదా అన్న విషయాలపై ఆరా తీశారు. జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటికీ ఏర్పాటు చేసిన కుళాయిలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పరిశీలించి, అక్కడి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. పిల్లలకు నాణ్యమైన విద్యను, పౌష్టికాహారం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం అనసభద్ర గ్రామాన్ని కలెక్టర్ సందర్శించారు. పర్యటనలో జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి వీఎస్ నగేష్‌బాబు, తహసీల్దార్ షేక్ ఇబ్రహీం, ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి, సీడీపీఓ అనంతలక్ష్మి, తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి





సంఘటనా స్థలంలో మృతి చెందిన రాజు (ఇన్‌సెట్లో) మృతుడు రాము (ఫైల్)

మెంటాడ/రాజాం సిటీ: వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే... మెంటాడ మండలం జక్కువ గ్రామానికి చెందిన పది కుటుంబాల వారు 15 రోజుల కిందట వ్యవసాయ పనుల నిమిత్తం కృష్ణా జిల్లాలోని పామర్రు మండలం దిద్దవరం గ్రామానికి పనుల కోసం వెళ్లారు. శుక్రవారం ఉదయం పనులకు వెళ్లేందుకుగాను జక్కువ గ్రామానికి చెందిన కోంతెన రాము (56) మరో ముగ్గురితో కలిసి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాము అక్కడికక్కడే మృతి చెందగా.. అతనితో పాటు ఉన్న మరో ముగ్గురు గాయపడ్డారు. మృతుడికి భార్య కళావతి, ఇద్దరు కుమార్తెలున్నారు. రాము మృతి వార్త తెలియడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పామర్రు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు. అలాగే రాజాం పట్టణ పరిధి పాలకొండ రోడ్డులో జరిగిన ప్రమాదంలో రేగిడి మండలం బూరాడ గ్రామానికి చెందిన కొంగరాపు రాజు (25) మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్వగ్రామం వెళ్లేందుకు స్నేహితులతో కలసి రాజు ఆర్టీసీ బస్సు ఎక్కాడు. అయితే తాను ఎక్కిన బస్సు బూరాడ వెళ్లదని తెలుసుకుని బస్సు దిగేందుకు ఆపాలని కోరాడు. ఈక్రమంలో బస్సు దిగుతుండగా ప్రమాదవశాత్తు బస్సు వెనుక చక్రాల కిందపడిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మరో వ్యక్తి..

దత్తిరాజేరు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని షికారుగంజి కూడలి వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్.బూర్జవలస ఎస్సై రాజేష్ తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశాలోని లెప్పగూడకు చెందిన కోరా దబులు (40) ఏడు గేదెలను తోలుకుంటూ పెదమానాపురం వస్తున్నాడు. సరిగ్గా షికారుగంజి కూడలి వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న ద్విచక్ర వాహనదారుడు ఢీ కొట్టడంతో దబులు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దబులు మృతదేహం

భవనంపై నుంచి పడి వ్యక్తి..



దేశపాత్రునిపాలెంలో ప్రమాదం జరిగిన అపార్ట్‌మెంట్ ఇదే

పరవాడ: దేశపాత్రునిపాలెం గ్రామంలో ఓ అపార్ట్‌మెంట్‌పై నిర్మాణ పనులు చేస్తున్న భవన నిర్మాణ కార్మికుడు నాలుగో అంతస్తు నుంచి జారి పడి మృతి చెందాడు. మృతుడు శ్రీకాకుళం జిల్లా వీరఘట్టాం మండలం కడకెల్ల గ్రామానికి చెందిన సీహెచ్ నాగరాజు అని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. దేశపాత్రునిపాలెం గ్రామ సమీపంలో పి.బోనంగికి వెళ్లే రహదారి వద్ద గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నాలుగు అంతస్తుల అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నాడు. శుక్రవారం ఉదయం నాగరాజు నాలుగో అంతస్తులో నిర్మాణ పనులు చేస్తుండగా ఉన్నట్టుండి కాలుజారి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో నాగరాజు తలకు బలమైన గాయమై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతదేహానికి కేజీహెచ్‌లో శనివారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు సీఐ తెలిపారు.

అదుపులో అతిసార..

- గుంకలాంలో వైద్యశిబిరం
- గ్రామంలో పర్యటించిన ఎంపీపీ మామిడి



శిబిరంలో రోగులను తనిఖీ చేస్తున్న వైద్యురాలు శ్రావణి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీపీ మామిడి, తదితరులు

విజయనగరం రూరల్: మండలంలోని గుంకలాం గ్రామానికి చెందిన కొంతమంది కొద్ది రోజులుగా అతిసారతో ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ మామిడి అప్పలనాయుడు శుక్రవారం గ్రామంలో పర్యటించారు. గ్రామంలో అప్పటికే నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని సందర్శించారు. గ్రామంలో రోగుల పరిస్థితిని రాకోడు పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణి, స్థానిక సర్పంచ్ కునుకు నాగరాజులను అడిగి తెలుసుకున్నారు. ఆరుబయట ఫుడ్ తీసుకోవడం, మద్యం అలవాటు, తదితర కారణాల వల్ల ఇద్దరికి... అలాగే జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు కలుషిత నీరు తాగడం వల్ల వాంతులు, విరేచనాలు అయినట్లు డాక్టర్ శ్రావణి ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చారు. ఐదు రోజులగా ఆస్పత్రి సిబ్బందితో పాటు స్థానిక సచివాలయం సిబ్బంది కూడా ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించడంతో పాటు మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. మూడు రోజులుగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం అతిసార అదుపులో ఉందని చెప్పారు. గ్రామంలో పారిశుధ్య పనులకు 15వ ఆర్థిక సంఘ నిధులు మంజూరుకు కృషి చేస్తానని ఎంపీపీ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

కానరాని అధికార పార్టీ నాయకులు

గుంకలాం గ్రామంలో అతిసార ప్రబలినా అధికార పార్టీ నాయకులెవ్వరూ గ్రామాన్ని సందర్శించిన దాఖలాలు లేవు. దీంతో ప్రజలంతా ప్రభుత్వం తీరుపై మండిపడుతున్నారు. ఎంపీపీ వెంట వైస్ ఎంపీపీ కర్రోతు నారాయణ, మైనార్టీ సెల్ కో ఆప్షన్ మెంబర్ షేక్ మస్తాన్, సచివాలయ కార్యదర్శి శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో భద్రత..

- టూటౌన్ పరిధిలోని 38 సీసీ కెమెరాలతో కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం
- మరో 60 సీసీ కెమెరాలతో అనుసంధానానికి చర్యలు
- కమాండ్ కంట్రోల్‌ను ప్రారంభించిన ఎస్పీ వకుల్ జిందాల్



టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కమాండ్ కంట్రోల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: పోలీస్ స్టేషన్ పరిధిలోని సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ విభాగంతో అనుసంధానం చేసుకుని నిత్యం పర్యవేక్షించడం అభినందనీయమని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నేర నియంత్రణ, ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, వాటిని నిరంతరం పర్యవేక్షించేందుకు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ రూమ్, కోర్టు మానటరింగ్ సిస్టమ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు ప్రతి ప్రాంతంలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటుచేసే విధంగా చర్యలు చేపట్టామన్నారు. స్థానిక అవసరాలకనుగుణంగా ప్రజల సహకారంతో 38 సీసీ కెమెరాలను టూటౌన్ పరిధిలోని తొమ్మిది ప్రాంతాల్లో ఏర్పాటు చేసి, వాటిని పోలీస్‌స్టేషన్‌లోని కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేయడం అభినందనీయమన్నారు. ఒక సీసీ కెమెరా 20 మంది పోలీసులు చేసే పనిని చేస్తుందని చెప్పారు. నేరాలు జరిగేందుకు అవకాశమున్న ప్రాంతాలపై నిరంతరం నిఘా పెట్టేందుకు, నేరాలను నియంత్రించేందుకు కెమెరాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈవ్ టీజింగ్, గంజాయి అక్రమ రవాణా, దొంగతనాలు వంటి నేరాల కట్టడిలో సీసీ కెమెరాలు, సాంకేతికతను వినియోగించుకుంటే మంచి ఫలితాలను సాధించవచ్చన్నారు. కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేసిన టూటౌన్ సీఐ శ్రీనివాసరావు అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఆరు నెలలుగా జిల్లా పోలీస్ యంత్రాంగం చక్కగా పనిచేయడంతో జిల్లాలో నేరాలు తగ్గుముఖం పట్టాయన్నారు. టూటౌన్ సీఐ టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ప్రాధాన్యతను వివరించడంతో స్థానిక ప్రజలతో పాటు వ్యాపారులు వాటి ఏర్పాటుకు ముందుకు వచ్చారన్నారు. కార్యక్రమంలో విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, ఎస్‌బీ సీఐ ఆర్‌వీఆర్‌కే చౌదరి, రూరల్ సీఐ బి.లక్ష్మణరావు, ఎస్సైలు మురళి, కృష్ణమూర్తి, ఏఎస్సై పైడితల్లి, పోలీస్ సిబ్బంది, ఎంఎస్‌పీలు, ప్రజలు పాల్గొన్నారు.



సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న ఎస్పీ

రామతీర్థంలో సహస్ర దీపారాధన



రామస్వామివారికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకస్వాములు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ సేవను ఆలయ అర్చకులు శుక్రవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. తూర్పు రాజగోపురం సమీపంలోని వేదికపై ఉన్న ప్రత్యేక ఊయలలో సీతారామచంద్ర స్వామిని ఆశీనులు చేసి సహస్ర దీపాల కాంతుల శోభలో స్వామికి పవళింపు జరిపించారు. సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు భక్తి శ్రద్ధలతో సహస్ర దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరిసింహాచార్యులు, కిరణ్, రామగోపాలా చార్యులు పాల్గొన్నారు.